కలుషిత నీరు తాగేదెలా?

- చెత్తాచెదారంతో కూడిన తాగునీరు దుర్వాసన
- జలమండలి అధికారులు అలసత్వాన్ని వీడేదెన్నడో
- రత్నానగర్‌లో మూడు నెలలుగా ఇదే పరిస్థితి

ప్రజలకు శుద్ధమైన తాగునీరు అందిస్తున్నామని గొప్పలు చెప్పుకుంటున్న జలమండలి అధికారుల మాటలకు చేతలకు పొంతనేలేదు. నల్లకుంట డివిజన్ పరిధిలోని చాలా బస్తీలలో తాగునీరు కలుషితమవుతున్నా పట్టించుకునే నాథుడే లేడనే సర్వత్రా విమర్శలు ఉన్నాయి.





కలుషిత నీటిని బాటిల్‌లో పట్టి చూపిస్తున్న రత్నానగర్ బస్తీవాసులు

నల్లకుంట డివిజన్ పరిధిలోని రత్నానగర్ బస్తీలోని ఓ లేన్‌లో కొన్ని నెలలుగా కుళాయిల ద్వారా చెత్తాచెదారంతో కూడి దుర్వాసనతో కలుషిత నీరు సరఫరా అవుతోంది. ఈ విషయాన్ని బస్తీ పెద్దలు జలమండలి నారాయణ గూడ సెక్షన్ మేనేజర్ దృష్టికి తీసుకువెళ్లినా సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోలేదని స్థానికులు వాపోతున్నారు. రోజు విడిచి రోజు రాత్రి 10 గంటల సమయంలో నీటిని వదులుతున్నారని, అప్పటి వరకు మెళకువగా ఉండి తీరా నీరు పట్టుకునే సరికి అరగంట, ముప్పావు గంట పాటు చెత్తాచెదారం, దుర్వాసనతో కూడిన మురుగు నీరు సరఫరా అవుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నరు. ఫిల్టర్ వాటర్ కొనుక్కుని తాగే స్థోమతలేక విధిలేని పరిస్థితిలో అరగంట తరువాత చెత్తతో కూడిన నీటిని వడకట్టి పట్టుకుంటున్నామని చెబుతున్నారు. ఆ వడకట్టిన నీటిని కొందరు వేడి చేసుకుని వాడుకుంటున్నామని స్థానికులు పేర్కొంటున్నారు. కలుషిత నీటిని వాడుతున్న బస్తీలోని చాలా మంది రోగాల బారినపడి ఆసుపత్రుల పాలవుతున్నారని అంటున్నారు.

మురుగు నీరే గతి



బస్తీలో గత మూడు, నాలుగు నెలలుగా కుళాయిల నుంచి మురుగునీరు వస్తుంది. ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకు వెళ్లినా, జలమండలి అధికారులకు ఎన్ని సార్లు చెప్పినా ఎవరూ పట్టించుకోవడం లేదు. కనీసం ట్యాంకర్లతో కూడా మంచి నీటిని పంపించడం లేదు. దుర్వాసనతో ఉన్న నీరు తాగలేక, బయట నుంచి కొనుక్కోలేక, విధిలేని పరిస్థితిలో ఆ మురుగు నీటినే వడకట్టుకుని తాగుతూ రోగాల బారిన పడుతున్నాం.

– లక్ష్మి, గృహిణి

ఇలాగైతే బతికేదెలా



మూడు నెలలకు పైగా కుళాయిల నుంచి డ్రైయిన్ నీరు కలిసి వస్తుంది. వాసన వచ్చే నీటిని ఎలా వాడాలి. ప్రజా ప్రతినిధులు, అధికారులు ఎవరూ పట్టించుకోరు. ఈ నీటిని తాగలేకపోతున్నాం. డబ్బు పెట్టి ఫిల్టర్ నీటిని కొనుక్కుని తాగాలంటే ఆ స్థోమత మాకు లేదు. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు, జలమండలి అధికారులు స్పందించి కలుషిత నీటి సమస్యకు శాశ్వత పరిష్కార చర్యలు తీసుకోవాలని బస్తీవాసులు కోరుతున్నారు.

– సంతోష, గృహిణి

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన వీఎస్‌ఆర్



సీఎంకు పుష్పగుచ్ఛం అందిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

ముషీరాబాద్: మాజీ మంత్రి నాయిని నర్సింహారెడ్డి అల్లుడు, కార్మిక నాయకులు వి.శ్రీనివాస్‌రెడ్డి గురువారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఆయన నివాసంలో కలిశారు. సూపర్ మ్యాక్స్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడిగా ఉన్న శ్రీనివాస్‌రెడ్డి సూపర్ మ్యాక్స్ వర్కర్ల పరిస్థితి గురించి ముఖ్యమంత్రికి వివరించారు. రెండు సంవత్సరాలుగా అందులో పని చేసే కార్మికులకు జీతాలు లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, 275 రోజులుగా కార్మికులు రిలే నిరాహార దీక్షలు చేపడుతున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి జోక్యం చేసుకొని సమస్యను పరిష్కరించాలని పరోక్షంగా వెయ్యి కార్మికుల కుటుంబాలు సూపర్ మ్యాక్స్ కంపెనీపై ఆధారపడి జీవిస్తున్నాయని తెలిపారు. స్పందించిన ముఖ్యమంత్రి దీనిపై చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చినట్లు శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

స్వామి వివేకానంద బోధనలు ఆదర్శం



స్వామి వివేకానంద చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అద్దంకి శ్రీధర్ బాబు

కవాడిగూడ: స్వామి వివేకానంద బోధనలు సమాజానికి దశ దిశ చూపుతాయని రామకృష్ణ మఠం అధ్యక్షుడు స్వామి బోధమయానంద అన్నారు. అంతర్జాతీయ యువజన ఉత్సవాలలో భాగంగా లోయర్ ట్యాంక్‌బండ్‌లోని రామకృష్ణ మఠం వివేకానంద ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యూమన్ ఎక్సిలెన్సీ సంయుక్త ఆధ్వర్యంలో స్వామి వివేకానంద ఆడిటోరియంలో గురువారం స్వామి వివేకానంద జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన గుంటూరు టొబాకో బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అద్దంకి శ్రీధర్ బాబు (ఐఏఎస్), డెక్స్‌టెరిటీ గ్లోబల్ సీఈవో శరత్ వివేక్ సాగర్ మాట్లాడుతూ... స్వామి వివేకానంద బోధనలతో సరైన సమయంలో సరియైన మార్గ నిర్దేశం లభిస్తుందన్నారు. యువత స్వామి వివేకానందను ఆదర్శంగా తీసుకొని లక్ష్యసాధనలో ముందుకు సాగాలని సూచించారు. ట్యాంక్‌బండ్‌పై ఉన్న స్వామి వివేకానంద విగ్రహానికి ఐపీఎస్ అధికారి సౌమ్య మిశ్రా పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ట్యాంక్‌బండ్ నుంచి రామకృష్ణ మఠం వరకు యువతీ యువకులు, రామకృష్ణమఠం సిబ్బంది, అవేకింగ్ ఇండియా పేరుతో ర్యాలీ నిర్వహించారు.

కూలిన భారీ వృక్షం: తప్పిన ప్రమాదం



నల్లకుంట: నల్లకుంటలోని మోడల్ రైతు చికెన్ బజార్ (ఎంఆర్‌సీబీ) పక్క గల్లీలోని ఓ పురాతన ఆలయం వద్ద ఉన్న భారీ వేప చెట్టు గురువారం ఉదయం ఒక్కసారిగా కూలి పడింది. ఆ సమయంలో స్థానికులెవరూ అటు వైపు రాకపోవడంతో ప్రమాదం పెను తప్పింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ వెంటనే విద్యుత్ శాఖ, జీహెచ్‌ఎంసీ హార్టికల్చర్ విభాగం అధికారులు, డీఆర్‌ఎఫ్ బృందానికి సమాచారమందించి అక్కడికి రప్పించారు. వెంటనే అక్కడికి చేరుకున్న విద్యుత్ శాఖ సిబ్బంది పక్కనే ఉన్న విద్యుత్ తీగలకు విద్యుత్ సరఫరాను నిలిపి వేశారు. అదే సమయంలో అక్కడికి చేరుకున్న డీఆర్‌ఎఫ్ బృందం యుద్ధ ప్రాతిపదికన కూలిన చెట్టు కొమ్మలు, ఇతర శిథిలాలను తొలగించారు. తొలగింపు పనులను ఎమ్మెల్యే కాలేరు దగ్గరుండి పర్యవేక్షించారు.

కార్మికులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తెలంగాణ రాష్ట్రంలో కార్మికులకు గుర్తింపు కార్డులు ఇవ్వడంతో పాటు ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని తెలంగాణ కార్మిక సమాఖ్య (టీకేఎస్) వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు కలకోటి రామన్న డిమాండ్ చేశారు. గురువారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో టీకేఎస్ ఆధ్వర్యంలో కార్మికుల హక్కుల గర్జన పేరుతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రామన్న మాట్లాడుతూ... అన్ని రంగాల్లో పని చేస్తున్న ఆటో డ్రైవర్లు, భవన నిర్మాణ కార్మికులు, తోపుడు బండ్లు, అడ్డా కూలీలు, సినిమా హాల్స్‌లో పని చేసే వారు, జూనియర్ ఆర్టిస్టులు తదితర కార్మికులను ప్రభుత్వం గుర్తించాలని కోరారు. కార్మిక సమాఖ్య ఉపాధ్యక్షులు ఏర్పుల వెంకటసాయిలు, రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి చిలుమల్ల సుజాత, సామాజికవేత్త రాజ్‌కుమార్, ఎస్.పి.శ్రీనివాస్, నత్తి లచ్చన్న, అమృత, మధు పాల్గొన్నారు.

అభినందన



ముషీరాబాద్: ముషీరాబాద్ మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ అనుబంధ కిసాన్ సెల్ జాతీయ ఉపాధ్యక్షుడు కొదండరెడ్డిని సీసీఎల్‌ఏ సభ్య కార్యదర్శిగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నియమించడం పట్ల ముషీరాబాద్ నియోజకవర్గానికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. గురువారం కోదండరెడ్డిని ఆయన నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు, టీపీసీసీ కార్యదర్శి జి.ఎస్.కేశవ్, మోహియుద్దీన్, లీగల్ సెల్ నాయకులు శ్రీరాములయాదగిరి, గుర్రం శంకర్, మేడి సురేష్, జగన్‌మోహన్, నాగేంద్రప్రసాద్, అంజయ్యగౌడ్, జహంగీర్, ప్రసాద్‌కుమార్, ఆశోక్‌యాదవ్, జై భీమ్ సేనా అధ్యక్షులు పి.బల్వంత్‌రావు, సాయిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అజ్మీర్ దర్గాకు చాదర్ సమర్పణ



చాదర్‌ను పరిశీలిస్తున్న మాజీ మంత్రి కేటీఆర్, అక్లక్ హుస్సేన్

ముషీరాబాద్: ప్రసిద్ధిగాంచిన అజ్మీర్ దర్గాకు భోలక్‌పూర్ బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు అక్లక్ హుస్సేన్ ఆధ్వర్యంలో గురువారం చాదర్‌ను సమర్పించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు కేటీఆర్ అజ్మీర్ దర్గాను పరిశీలించి ముస్లింలతో కలిసి సామూహిక ప్రార్థన చేశారు. ప్రతి సంవత్సరం అజ్మీర్ దర్గాకు భారీ చాదర్‌ను సమర్పిస్తామని అక్లక్ హుస్సేన్ తెలిపారు. బీఆర్‌ఎస్ నాయకులు అక్బర్ అలీ, మన్వర్ అలీ, అతిక్‌ఉర్ రెహమాన్, సైఫ్ ఉద్దీన్, జాహెద్ అలీ, ముజాద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గోమాత పూజ



గోమాత పూజలు నిర్వహిస్తున్న మాత వాకర్స్ క్లబ్ సభ్యులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: మాత వాకర్స్ క్లబ్ నల్లకుంట, గాయత్రీ మహిళా వాకర్స్ క్లబ్, రఘువీర్ విజయలక్ష్మి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం వీఎస్‌టీలోని నల్లపోచమ్మ ఆలయం వద్ద సామూహిక గోపూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సమాజ హితం కోసం సామూహిక గోపూజ కార్యక్రమాన్ని నిర్వహించామని ఇందులో 30 మంది భక్తులు పాల్గొన్నారని మాత వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ వై.మురళీధరుడు తెలిపారు. క్లబ్ కార్యదర్శి ఎ.శ్రీనివాస్, కోశాధికారి ఆర్.కె.జైహింద్, సలహాదారులు ఎ.రామలింగేశ్వర్‌రావు, మారం సురేష్, కేశవరావు, లోకేష్, వినోద్, డాక్టర్ రాములు, అవతారం, మురళీకృష్ణ పాల్గొన్నారు.

జేసుదాసు గళంలో సమ్మోహన శక్తి



డైరెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ రాజగోపాల్ దంపతులను సత్కరిస్తున్న దృశ్యం

చిక్కడపల్లి: జేసుదాసు గళంలో సమ్మోహన శక్తి ఉందని పలువురు పేర్కొన్నారు. చిక్కడపల్లి త్యాగరాయ గానసభలో గురువారం రాత్రి గానసభ ప్రధాన వేదికపై లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్, ఎస్‌బీఐ సహకారంతో శ్రీ కృష్ణ స్వర రాగ ప్రవంతి నిర్వహణలో పద్మ విభూషణ్ డాక్టర్ కె.జేసుదాసు 84వ జన్మదిన వేడుకల్లో భాగంగా వైఎస్ రామకృష్ణ సహగాయనీమణులతో కలసి ఏక గళ యుగళ గీతాలు మధురంగా ఆలపించారు. అమృతం తాగిన వాళ్లు దేవతలు, దారి చూపిన దేవతా, హరి నివాసం, వంటి పలు గీతాలను రామకృష్ణ ఆలపించారు. లలిత, అఖిల, ఇందినయన, తుషార తదితరులు యుగళ గీతాలలో పాలు పంచుకున్నారు. ఎస్‌బీఐ ఉన్నతాధికారి , అన్నమాచార్య సంకీర్తనల విశ్లేషకుడు వెంకట్ గరికపాటి, వంశీరామరాజు, విశ్రాంత న్యాయమూర్తి మధుసూదన్, బృందావనం సుబ్రహ్మణ్యం, శ్రీరామ చంద్రోశేఖర్, తదితరులు పాల్గొని రామకృష్ణ గళంలో మాధుర్యం ఏసుదాసుకు దగ్గరగా ఉందని అభినందించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీలు రాజగోపాల్ దంపతులు అతిథులు సత్కరించారు.

యాదవులు అన్ని రంగాల్లో రాణించాలి



కవాడిగూడ: యాదవులు ఆర్థిక, రాజకీయ రంగాలలో రాణించాలని మాజీ ఎంపీ, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ అంజన్‌కుమార్‌యాదవ్ పిలుపునిచ్చారు. గురువారం కవాడిగూడలో ముషీరాబాద్ యాదవ మహాసభ కేలండర్‌ను సలంద్రి శ్రీనివాస్ యాదవ్ నేతృత్వంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అంజన్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ... గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం యాదవ సామాజిక వర్గానికి గొర్లు, బర్లకే పరిమితం చేసి రాజ్యాధికారం వైపు రాకుండా కుట్రలు చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. యాదవులు విద్యా, ఉద్యోగ, వ్యాపార రంగాలలో రాణించాలని, అందుకు తనవంతు పూర్తి సహాయ సహకారాలు ఉంటాయని తెలిపారు. సికింద్రాబాద్ కాంగ్రెస్ అధ్యక్షుడు అనిల్ కుమార్ యాదవ్, కొమురవెల్లి మల్లికార్జున స్వామి దేవస్థానం మెంబర్ అంజియాదవ్, నగర కాంగ్రెస్ సీనియర్ నాయకులు పాశం అనిల్ యాదవ్, బలరాం యాదవ్, సురేష్ యాదవ్, కిట్టు యాదవ్, గాజుల శ్రీనివాస్, సత్యనారాయణ, మధు, సి.హెచ్.శ్రీనివాస్ పాల్గొన్నారు.

పాఠశాలల్లో సందడిగా సంక్రాంతి



అంబేద్కర్ కళాశాలలో...

ముషీరాబాద్: ముషీరాబాద్‌లోని పలు పాఠశాలల్లో సంక్రాంతి శోభ వెల్లివిరిసింది. పాఠశాలలకు సెలవులు ప్రకటించడంతో సంక్రాంతి సంస్కృతి, సంప్రదాయాలను విద్యార్థులకు తెలియజేసేందుకు ఆయా పాఠశాలల యాజమాన్యాలు, ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి రంగురంగుల రంగవల్లులు, గొబ్బెమ్మలు, హరిదాసుల వేషధారణతో అలరించారు. రాంనగర్‌లోని కాకతీయ హై స్కూల్‌లో విద్యార్థులు రంగు రంగుల ముగ్గులు వేసి అలరించగా, బాకారంలోని రెడ్ కాన్వెంట్ పాఠశాలలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. విద్యార్థులు వేసిన అందమైన రంగవల్లులతో పాఠశాల ఆవరణ కొత్త శోభ సంతరించుకుంది. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కమటం సౌజన్యం పాఠశాల కరస్పాండెంట్ కమటం రఘు, ఉపాధ్యాయులు అరుణ, కవిత, రాజేశ్వరి, ఆశాదత్త తదితరులు పాల్గొని విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు.

అంబేద్కర్ కళాశాలలో...

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: బాగ్‌లింగంపల్లిలోని అంబేద్కర్ కళాశాలలో సంక్రాంతి వేడుకలను నిర్వహించారు. సాంస్కృతిక, ముగ్గుల పోటీల్లో పాల్గొని సత్తా చాటిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. అంబేద్కర్ కళాశాలల సెక్రటరీ గడ్డం వినోద్‌కుమార్, అంబేద్కర్ విద్యా సంస్థల ప్రిన్సిపాల్స్, డైరెక్టర్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.

అంబర్‌పేట పరిధిలో...

అంబర్‌పేట్: పండుగలు దేశ సంస్కృతి, సంప్రదాయాన్ని చాటి చెబుతాయని అంబర్‌పేట్ డివిజన్ కార్పొరేటర్ విజయకుమార్‌గౌడ్ తెలిపారు. గురువారం ప్రేమ్‌నగర్‌లోని హైమావతి పాఠశాలలో విద్యార్థులు, తల్లిదండ్రులకు సంక్రాంతి ముగ్గుల పోటీలు జరిగాయి. విద్యార్థుల తల్లిదండ్రులు పోటీలు పడుతూ ముచ్చటైన ముగ్గులు వేశారు. అనంతరం విజేతలకు కార్పొరేటర్ విజయకుమార్‌గౌడ్ బహుమతులు అందజేశారు. పాఠశాల కరస్పాండెంట్ హైమావతి, ప్రిన్సిపాల్ నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

నారాయణ పాఠశాలలో...

డీడీ కాలనీలోని నారాయణ ఈ టెక్నో పాఠశాలలో సంక్రాంతి సంబరాలు సందడిగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ మౌని స్టాలిన్, వైస్ ప్రిన్సిపాల్ శిరీషా, కోఆర్డినేటర్‌లు నూరహన్, లక్ష్మీభవానీ, ఏవో మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

హైందవి విద్యాసంస్థల్లో...

నల్లకుంట: నల్లకుంటలోని హైందవి ఇంటర్, డిగ్రీ, పీజీ కళాశాలలో సంక్రాంతి సందరాలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులు పతంగులు తయారు చేసి ఎగురవేస్తూ సందడి చేశారు. కళాశాల ఆవణలో రంగు రంగుల ముగ్గులు వేసి ఆకట్టుకున్నారు. హైందవి విద్యా సంస్థల డైరెక్టర్ గడ్డం శ్రీనివాస్ యాదవ్, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



హైందవి కళాశాలలో...



బాకారంలోని రెడ్ కాన్వెంట్ స్కూల్‌లో సంక్రాంతి సంబరాలు



హైమావతి స్కూల్‌లో విజేతలకు బహుమతులిస్తున్న కార్పొరేటర్ విజయకుమార్‌గౌడ్



రాంనగర్‌లోని కాకతీయ హై స్కూల్‌లో...

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: టీఎస్ఎస్‌పీడీసీఎల్–11 కేవీ ఆజామ్ బాద్ డివిజన్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల నిమిత్తం పలు ప్రాంతాల్లో ఉదయం 9.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఏడీఈ విజయభాస్కర్ తెలిపారు. బర్కత్‌పురా ఫీడర్ పరిధిలో బర్కత్‌పురా, పద్మాకాలనీ, శంకర్‌మఠ్ కూరగాయల మార్కెట్ తదితర ప్రాంతాలలో 9.30 నుంచి 11.30 వరకు, మూన్ కేఫ్ ఫీడర్ పరిధిలో శ్రీరామ్‌నగర్, అచ్చయ్యనగర్, మూన్‌కేఫ్, హెరిటేజ్ ఫ్రెష్, బృందావన్ కాలనీ తదితర ప్రాంతాలలో 11.30 నుంచి 1.30 వరకు విద్యుత్ ఉండదన్నారు. శంకర్‌మఠ్ ఫీడర్ పరిధిలో నల్లకుంట, అమర్ మెటర్నిటీ ఆస్పత్రి, మాతృశ్రీ స్కూల్ తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 2.30 నుంచి సాయంతరం 4.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. నల్లకుంట ఫీడర్ పరిధిలో విజయ బ్యాంక్, భారత ఇన్‌స్టిట్యూట్, తిలక్‌నగర్ రోడ్, ఫీవర్ ఆస్పత్రి తదితర ప్రాంతాలలో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ ఉండదని వివరించారు.

అభివృద్ధి పనులను నిర్ణీత సమయంలో పూర్తి చేయించాలి

అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్



నర్సింహ బస్తీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలేరు

నల్లకుంట: అంబర్‌పేట నియోజకవర్గంలోని బస్తీలు, కాలనీలలో చేపట్టిన అభివృద్ధి పనులను నిర్ణీత సమయంలో పూర్తి చేయించి ప్రజల వినియోగంలోకి తీసుకురావాలని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ జీహెచ్‌ఎంసీ, జలమండలి అధికారులకు సూచించారు. నల్లకుంట డివిజన్ పరిధిలోని నర్సింహబస్తీలో నూతనంగా చేపట్టిన సీసీ రోడ్డు పనులను గురువారం ఎమ్మెల్యే కాలేరు జీహెచ్‌ఎంసీ, జలమండలి అధికారులతో కలిసి పరిశీలించారు. పనుల పురోగతిపై అధికారులతో మాట్లాడి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అభివృద్ధి పనుల్లో నాణ్యతా, ప్రమాణాలు లోపించకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉండాలని సంబంధిత శాఖల అధికారులకు సూచించారు. అనంతరం బస్తీలో పాదయాత్ర చేసిన ఎమ్మెల్యే స్థానికులను కలిసి ఏమైనా ప్రజా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో బస్తీ అధ్యక్ష కార్యదర్శులు ఎం.భూపతినాథ్, శ్రీనివాస్, జలమండలి శివం సెక్షన్ మేనేజర్ రోహిత్, జీహెచ్‌ఎంసీ సూపర్‌వైజర్ నరేందర్, బస్తీ ప్రజలు పాల్గొన్నారు.

మానవతావాది జర్నలిస్టు నర్సింగరావు

ముషీరాబాద్: ఎర్రం నర్సింగ్‌రావు సీనియర్ జర్నలిస్టు మాత్రమే కాదని ఆయన గొప్ప మానవతావాది అని ఆయన సమాజాభివృద్ధికి చేసిన కృషి ఎనలేనిదని పలువురు వక్తలు కొనియాడారు. గురువారం రాంనగర్‌లోని రాజ్ ఫంక్షన్‌హాల్‌లో ఇటీవల మరణించిన సీనియర్ జర్నలిస్టు ఎర్రం నర్సింగ్‌రావు సంతాప సభ ముషీరాబాద్ వర్కింగ్ జర్నలిస్టు అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సభకు ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, కవాడిగూడ డివిజన్ కార్పొరేటర్ రచనశ్రీ, మాజీ కార్పొరేటర్లు వాజీద్‌హుస్సేన్, బి.శ్రీనివాస్‌రెడ్డి, రవీందర్, బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ రమేష్‌రామ్, ఓబీసీ మోర్చా జాతీయ నాయకులు పూస రాజు, తెలంగాణ జనసమితి గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు ఎం.నర్సయ్య, న్యూ డెమాక్రసీ నాయకులు ఎస్.వెంకటేశ్వర్‌రావు, కె.గోవర్ధన్, ఎం.శ్రీనివాస్, అరుణోదయ విమల, జర్నలిస్టు సంఘం రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.

లాల్ బహదూర్‌శాస్త్రికి నివాళి



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్ తదితరులు

ముషీరాబాద్: స్వాతంత్ర్య సమర యోధుడు, మాజీ ప్రధాని లాల్ బహాదర్ శాస్త్రీ వర్ధంతిని గురువారం భోలక్‌పూర్ డివిజన్ రంగానగర్‌లో భోలక్‌పూర్ డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే ముఠా గోపాల్, బీఆర్‌ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహ, సీనియర్ నాయకులు బింగి నవీన్, శంకర్‌గౌడ్, రహీం, జునేద్‌బాగ్దాదీ తదితరులు పాల్గొని లాల్ బహదూర్ శాస్త్రీకి నివాళులు అర్పించారు.

కార్మికులకు సత్వర న్యాయం అందాలి

చిక్కడపల్లి: కార్మికులకు సత్వర న్యాయం జరిగేలా అధికారులు, సిబ్బంది కృషి చేయాలని కార్మిక శాఖ కమిషనర్ కృష్ణాదిత్య సూచించారు. కార్మిక శాఖ కమిషనర్‌గా బాధ్యతలను స్వీకరించిన కృష్ణాదిత్యను రాష్ట్ర సహాయ కార్మిక శాఖ కమిషనర్‌ల సంఘం అధ్యక్షుడు బి.జానస్, కార్యదర్శి జీబీఎస్ స్వామి, కోశాధికారి యాదయ్య తదితరులు గురువారం కలసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యవర్గ సభ్యులు వెంకట్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, వెంకటరమణ, గౌరవ కార్యదర్శి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

స్ఫూర్తిప్రదాత వడ్డె ఓబన్న

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: వడ్డెరుల ఆత్మగౌరవ భవన సముదాయాల ట్రస్ట్, వడ్డెర సంఘం సంయుక్త ఆధ్వర్యంలో వడ్డెర్ల ఆరాధ్య దైవమైన వడ్డె ఓబన్న జయంతి ఉత్సవాన్ని గురువారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ డి.చంద్రశేఖర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ... వడ్డెరుల సమస్యలను పరిష్కరించడానికి తాము శక్తివంచన లేకుండా కృషి చేస్తామని తెలిపారు. వడ్డెరుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకుపోతామని అన్నారు. వడ్డెర ఫెడరేషన్ ఎండీ శ్రీనివాస్‌రెడ్డి, వడ్డెరుల ఆత్మగౌరవ భవన సముదాయాల ట్రస్ట్ చైర్మన్ జరుపెటి సత్యనారాయణరాజు, వడ్డెర సంఘం చైర్మన్ వేముల వెంకటేష్, ట్రస్ట్ వైస్ చైర్మన్ ఎత్తరి అంతయ్య, డాక్టర్ ఉర్సు కృష్ణయ్య, ట్రస్ట్ డైరెక్టర్లు మక్కుల వెంకటేష్, వల్లపు వెంకట్, శివభూపతి, రామలక్ష్మి, ఎత్తరి మాలయ్య, వరికుప్పల లింగయ్య తదితరులు పాల్గొన్నారు. అనంతరం వడ్డె ఓబన్న మునిమనవడు మంజూల బాలనర్సింహుడుకు శాలువాతో సన్మానించడంతో పాటు వడ్డె ఓబన్నకు సంబంధించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు.

రాజకీయ చైతన్యం తేవడంలో సరోజినీనాయుడి కృషి అమోఘం

చిక్కడపల్లి: ప్రజల్లో రాజకీయ చైతన్యం తీసుకురావడంలో సరోజినీ నాయుడు కీలకపాత్ర పోషించారని రాష్ట్ర భాషా సంఘం పూర్వ అధ్యక్షురాలు మంత్రి శ్రీదేవి అన్నారు. గురువారం చిక్కడపల్లి త్యాగరాయ గానసభలోని కళాసుబ్బారావు కళావేదికలో భారత కోకిల, స్వాతంత్ర్య సమరయోధురాలు సరోజినీ నాయుడు యాదిలో శీర్షికతో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీదేవి మాట్లాడుతూ... గాంధీజీ పిలుపుతో స్వాతంత్ర్య సమరంలో పాల్గొని మహిళలకు స్ఫూర్తిగా నిలిచారని కొనియాడారు. కులరహిత సమాజం కోసం పోరాడిన మహనీయురాలన్నారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్ధనమూర్తి అధ్యక్షత వహించిన కార్యక్రమంలో కథక్ కళాక్షేత్రం నృత్యగురువు డాక్టర్ పండిట్ ఆంజిబాబు, సాహితీవేత్త చిక్కా రామదాసు, గానసభ కమిటీ సభ్యురాలు గుండవరపు గీతాదేవి తదితరులు పాల్గొన్నారు.